7

సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025

రామ రామ రఘురామ..

నగరంలోని వెలంపేట సీతారామ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం జరగనుండగా, గురువారం ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. పలువురు మహిళలు 'రామ రామ రఘురామా..'అంటూ ఉత్సవ విగ్రహాలను, మకరతోరణాలను శుభ్రం చేశారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కూటమి కుట్రలు



వైఎస్సార్‌సీపీ నాయకులపై ఆగని అక్రమ కేసులు

- **కక్షపూరితంగా తప్పుడు కేసులు బనాయింపు**
- **తాజాగా వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజుపై కుట్రలు**
- విశాఖ రాజధాని కోసం ప్రజలు చేపట్టిన నిరసనపై టీడీపీ పీఆర్వో గోపాల్‌రెడ్డి ఫిర్యాదు
- కేసులు పెట్టి అరెస్టు చేయాలంటూ పోలీసులపై ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లు?
- నాడు వైఎస్సార్‌సీపీలో ఉన్న గోపాల్‌రెడ్డి కూడా అదే నిరసనలో పాల్గొనడం గమనార్హం
- చంద్రబాబును అడ్డుకుంటున్న గోపాల్‌రెడ్డి ఫొటోలు నెట్టింట చక్కర్లు

విశాఖ సిటీ : అబద్ధపు హామీలతో అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఒకవైపు జిల్లాలో వరుస హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతుంటే పట్టించుకోని కూటమి ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ నేతలపై రాజకీయ ప్రేరేపిత కేసులకు తెగబడుతోంది. అధికారం చేపట్టిన నాటి నుంచి కూటమి ప్రభుత్వ తప్పిదాలను తూర్పారబెడుతున్న వారిపై తప్పుడు కేసులు బనాయిస్తోంది. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తల నుంచి మాజీ మంత్రుల వరకు ప్రతి ఒక్కరిపై టీడీపీ కార్యకర్తలతోనే బలవంతంగా కక్షపూరిత కేసుల పెట్టించి వారి నోర్లు మూయించాలని చూస్తోంది. తాజాగా వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజుపై కూడా తప్పుడు కేసులతో ఇబ్బందులకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. విశాఖ పరిపాలన రాజధాని కోసం ఉత్తరాంధ్ర ప్రజలు చేపట్టిన నిరసన విషయంలో వైఎస్సార్ సీపీ నేతలపై కుట్రపూరితంగా టీడీపీ పీఆర్వో కె.గోపాల్‌రెడ్డి ఇప్పటికే ఫిర్యాదు చేశారు. తాజాగా కేకే రాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి పోలీసులపై తీవ్ర ఒత్తిళ్లు వస్తున్నట్లు టీడీపీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే.. నాడు వైఎస్సార్‌సీపీలో ఉన్న గోపాల్‌రెడ్డి స్వయంగా విశాఖ విమానాశ్రయంలో చంద్రబాబును అడ్డుకొని.. నేడు టీడీపీ పీఆర్వోగా చేరి.. కేకే రాజుపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

నాడు అడ్డుకున్న వ్యక్తే.. నేడు ఫిర్యాదు

చంద్రబాబు పర్యటనకు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన కె.గోపాలరెడ్డి.. చంద్రబాబును అడ్డుకున్నారంటూ వైఎస్సార్‌సీపీ నేతలపై నేడు ఫిర్యాదులు చేస్తుండడం గమనార్హం. 2019 ఎన్నికల తరువాత గోపాల్‌రెడ్డి వైఎస్సార్ సీపీలో చేరారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం నాయకులతో చెట్టాపట్టాలేసుకొని తిరిగారు. 2020లో చంద్రబాబును విశాఖ విమానాశ్రయంలో అడ్డుకున్న వారిలో గోపాల్‌రెడ్డి ప్రథమ వరుసలో ఉన్నారు. పోలీసులను తోసుకుంటూ మరీ చంద్రబాబుపై రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు, ఫొటోలు పచ్చమీడియా, పత్రికల్లో సైతం ప్రసారమయ్యాయి. జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి కార్పొరేటర్ టికెట్ ఆశించిన గోపాల్‌రెడ్డి.. అది దక్కకపోవడంతో టీడీపీ పంచన చేరారు. అక్కడ కూడా పార్టీ పదవి లేకపోవడంతో ప్రస్తుతం పీఆర్వోగా మీడియా వ్యవహారాలు చూస్తున్నారు. నాడు చంద్రబాబును అడ్డుకున్న గోపాల్‌రెడ్డి.. నేడు వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా మారింది. పోలీసులను తోసుకుంటూ గోపాల్‌రెడ్డి చంద్రబాబును అడ్డుకుంటున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.



2020లో చంద్రబాబును అడ్డుకునేందుకు పోలీసులను తోసుకువస్తున్న గోపాల్‌రెడ్డి

విశాఖపై విషం.. చంద్రబాబుకు నిరసన సెగ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని నిర్ణయించారు. అయితే అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఇతర టీడీపీ నాయకులు, పచ్చ పత్రికలు, మీడియా విశాఖపై విషం చిమ్మాయి. విశాఖ రాజధాని కాకుండా కోర్టుల్లో కేసులు వేశారు. దీనిపై ఉత్తరాంధ్ర ప్రజలు భగ్గుమన్నారు. ఈ సమయంలో 2020, ఫిబ్రవరి 27న చంద్రబాబు విశాఖ పర్యటనకు వచ్చారు. విశాఖపై తప్పుడు ప్రకటనలు చేస్తూ.. రాజధాని కాకుండా అడ్డుకున్న చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. విశాఖ విమానాశ్రయం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు చంద్రబాబుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. దీంతో చంద్రబాబు తిరుగుపయనమవ్వాల్సి వచ్చింది.

పోలీసులపై ఒత్తిళ్లు

కేకే రాజును అరెస్టు చేయాలంటూ కూటమి నాయకులు పోలీసులపై తీవ్ర ఒత్తిళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు పర్యటన సమయంలో వేలాది మంది ప్రజలు ఆందోళనలో పాల్గొన్నారు. చంద్రబాబును నగరంలోకి రాకుండా అడ్డుకున్నారు. కానీ ఎయిర్‌పోర్టుకు గానీ, ఇతర ప్రభుత్వ ఆస్తులకు గానీ ఎటువంటి నష్టం కలగలేదు. అయినప్పటికీ కేవలం చంద్రబాబును అడ్డుకున్నారన్న కారణంతోనే.. కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేయడంపై పోలీసులు సైతం తర్జనభర్జన పడుతున్నారు. కేకే రాజుతో పాటు మరికొందరిపై ఏదోలా తప్పుడు సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్టులు చేయాలని గతేడాది నవంబర్ నుంచి కూటమి నాయకులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ విషయాన్ని గోపాల్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం మంత్రి నారా లోకేష్ దృష్టికి సైతం తీసుకువెళ్లారు. తాజాగా చంద్రబాబు పర్యటనలో కూడా కేకే రాజుపై కేసు విషయంపై అర్జీ ఇచ్చారు. దీంతో కేకే రాజుపై కేసు నమోదు చేయాలని పోలీసులపై ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు టీడీపీలోనే చర్చ జరుగుతోంది. ఎవరిపైన దాడులు గానీ, ప్రభుత్వ ఆస్తులను నష్టం గానీ జరగని.. వేలాది మంది చేపట్టిన నిరసనలో కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షపూరితంగా కేసులెలా నమోదు చేస్తారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

పారిశుధ్య కార్మికుల పోస్టు
రూ.1.5 లక్షలు

- జోన్–8లో రెండు వార్డుల్లో కార్పొరేటర్ల దందా
- రాత్రికి రాత్రి 22 మంది కార్మికుల నియామకం
- సీఎంహెచ్‌ఓకు తెలియకుండా పనుల అప్పగింత



డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8 పరిధిలో ఇద్దరు కార్పొరేటర్ల దందా చర్చనీయాంశమవుతోంది. వారికి వంతపాడిన అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారికి చెప్పకుండా.. రాత్రికి రాత్రి 22 మంది పారిశుధ్య కార్మికులను నియమించడం జీవీఎంసీలో తీవ్ర దుమారం రేపుతోంది. ఇద్దరు కార్పొరేటర్లు ఒక్కో కార్మికుడి నుంచి రూ.50 వేలు నుంచి రూ.1.5 లక్షలు వరకు వసూలు చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీలో చాలా వార్డుల్లో రాత్రి పారిశుధ్య పనులకు కార్మికుల కొరత ఉంది. దీంతో తాత్కాలిక ప్రాతిపదికన కార్మికులను నియమించాలని అధికారులు నిర్ణయించారు. దీని ప్రకారం జోన్–8 పరిధిలో రెండు వార్డుల్లో 22 మంది రాత్రి పారిశుధ్య కార్మికులను తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

అధికారులపై ఒత్తిళ్లు : వాస్తవానికి రాత్రి పారిశుధ్య కార్మికుల నియామకాలు కొద్ది రోజులు ఆపాలని టీడీపీ కార్పొరేటర్లు కొందరు అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అయితే జోన్–8లో ఇద్దరు కార్పొరేటర్లు మాత్రం వెంటనే తమ వార్డుల్లో కార్మికులను నియమించాలని పట్టుబట్టారు. అధికారులపై తీవ్ర ఒత్తిడి చేశారు. దీంతో అధికారులు సైతం చేసేదేమీ లేక కార్పొరేటర్లు చెప్పిన విధంగా బుధవారం రాత్రికి రాత్రి 22 మంది పారిశుధ్య కార్మికులను పనుల్లోకి ఎక్కించారు.

రూ.50 వేలు నుంచి రూ.1.5 లక్షలు వసూలు

తాత్కాలిక ప్రాతిపదికన అత్యవసర పనుల నిమిత్తం తీసుకున్న ఈ రాత్రి పారిశుధ్య కార్మికుల నుంచి రూ.50 వేలు నుంచి రూ.1.5 లక్షలు వరకు ఇద్దరు కార్పొరేటర్లు వసూలు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారికి సమాచారం లేకుండా కార్మికులను నియమించడం చర్చనీయాంశమవుతోంది. జోన్–8 అధికారులు కార్పొరేటర్ల ఒత్తిళ్లతో కార్మికులను నియమించిన తరువాత గురువారం ధీమాగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. అలాగే ఇద్దరు కార్పొరేటర్ల వ్యవహార శైలిపై కొందరు టీడీపీ కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. తాత్కాలిక పోస్టు కోసం ఇంత భారీ మొత్తంలో డబ్బు వసూలు చేయడాన్ని తప్పుబడుతున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో తీసుకున్నా వారికి కొంత ఉద్యోగ భద్రత ఉంటుంది. ఎటువంటి ఉద్యోగ భద్రత లేని పోస్టులకు రూ.1.5 లక్షలు వసూలు చేయడం గమనార్హం. అయితే దీనిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరి.

సీనియార్టీ జాబితా విడుదల

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల చేసినట్లు డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. వీటి ఆధారంగానే త్వరలో పదోన్నతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీ వరకు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ఉపకరణాల పంపిణీ

మహారాణిపేట: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు శుక్రవారం ఉపకరణాల పంపిణీ చేయనున్నారు. పాఠశాల విద్యాశాఖ–సమగ్ర శిక్ష విశాఖ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ హాజరవుతారు.

---

7 నుంచి 'ఎన్టీఆర్ వైద్య సేవ' నిలిపివేత

ఆషా అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ

మహారాణిపేట: ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అందించే అన్ని రకాల వైద్య సేవలను ఈ నెల 7 నుంచి పూర్తిగా నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్(ఆషా) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.మురళీకృష్ణ తెలిపారు. నిస్సహాయత, గత్యంతరం లేక, ఇక ఎంత మాత్రం భరించలేక బాధపడుతూనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకానికి అర్హులైన పేద వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని, ఈ ప్రయత్నంలో మోయలేనంత ఆర్థిక భారం పడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.3,500 కోట్ల బకాయిలున్నాయన్నారు. ఈ బకాయిలు పేరుకుపోవడంతో ఆస్పత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ఆస్పత్రులు బ్యాంకుల నుంచి ఓవర్ డ్రాఫ్టులు, ప్రైవేట్ సంస్థల నుంచి వడ్డీలకు అప్పులు తెచ్చి నిర్వహించాల్సి వస్తోందన్నారు. చాలా నెట్‌వర్క్ ఆస్పత్రులు పూర్తిగా పరపతి పోగొట్టుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే వైద్య సేవ పథకంలోని అన్ని రకాల వైద్య సేవలు నిలిపివేస్తున్నామని వెల్లడించారు.

అందరి సహకారంతోనే పోర్టు సరికొత్త మైలురాయి



అభినందిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : సరకు హ్యాండ్లింగ్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ 82.62 మిలియన్ టన్నుల మైలురాయిని దాటి కొత్త రికార్డు నెలకొల్పడం వెనుక భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పోర్టు చైర్మన్ డా.అంగముత్తు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ఘనంగా ముగిసిన నేపథ్యంలో.. అభినందన సభను పోర్టు బోర్డు రూంలో గురువారం నిర్వహించారు. ఉద్యోగుల సంఘాలు, స్టీవడోర్లు, టెర్మినల్ ఆపరేటర్లు, పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) సంస్థలు, ఎగుమతి, దిగుమతిదారులు, కార్మిక సంఘాలు, పోర్టు వ్యాపార వర్గాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతోనే గత ఆర్థిక సంవత్సరపు రికార్డును అధిగమించి నూతన రికార్డ్‌ను నెలకొల్పిందన్నారు. ఇదే ఊపుతో 2025–26 ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల టార్గెట్‌ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఆనందోత్సాహాలతో ఆర్చ్ బిషప్ ప్రతిష్టాపన



విశాఖ ఆర్చ్ బిషప్ ఉడుమల బాల, కార్యక్రమానికి హాజరైన క్రైస్తవులు

విశాఖ ఆర్చ్‌బిషప్‌గా ఉడుమల బాల

డాబాగార్డెన్స్: వేలాదిగా తరలి వచ్చిన క్రైస్తవ విశ్వాసులు.. వందలాది నన్‌లు, ప్రముఖ ఆర్చ్ బిషప్‌లు, బిషప్‌లు, ప్రొవిన్షియల్ సుపీరియర్లు, ప్రీస్ట్స్, మతాధికారుల సమక్షంలో.. పోప్ ప్రతినిధి మోస్ట్ రెవరెండ్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి నేతృత్వంలో.. ఆధ్యాత్మిక పండగలా సాగిన వేడుకలో మోస్ట్ రెవరెండ్ ఉడుమల బాల విశాఖ ఆర్చ్‌బిషప్(అగ్రపీఠాధిపతి)గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వాల్తేరు ఆర్‌ఎస్ సమీపానున్న సెయింట్ జోసెఫ్ కళాశాల నుంచి సెయింట్ పీటర్స్ కేథడ్రల్ వరకూ భారీ ఊరేగింపు సాగింది. తన తొలి ప్రసంగంలో ఉడుమల బాల మాట్లాడుతూ తన జన్మభూమి వరంగల్ అయితే.. పుణ్యభూమి విశాఖ అని కొనియాడారు.

పోప్ ఫ్రాన్సిస్ ప్రతినిధి, భారత్– నేపాల్ అపోస్టోలిక్ నున్సియో(అంబాసిడర్) మోస్ట్ రెవరెండ్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విశాఖపట్నం ఆర్చ్ బిషప్‌కు కొత్త చీఫ్ పాస్టర్‌ను బహుమతిగా ఇచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు తెలిపారు. బాల నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖలో లక్షకు పైగా క్యాథలిక్ ప్రజలు ఉన్నారని, ప్రీస్టులు, నన్స్‌తో కూడిన బలమైన ఉనికి ఉందన్నారు. ఆర్చ్‌డియోసెస్ ఎదుర్కొంటున్న సవాళ్లపై గిరెల్లి స్పందించారు. ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగం, వలసదారుల దీనస్థితి, పర్యావరణానికి ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. 2015 నుంచి 2023 వరకు సీసీబీఐ కమిషన్ ఫర్ సెమినేరియన్స్, మతాధికారిగా బాల బాధ్యతలు, చైర్మన్‌గా ఆయన అనుభవాన్ని హైలైట్ చేశారు. ఆర్చ్ బిషప్ ఎమెరిటస్ ప్రకాష్ మల్లవరపు ఆర్చ్‌డయోసిస్‌కు చేసిన సేవలకు అపోస్టోలిక్ నన్సియో, అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా పాస్టోరల్ నాయకత్వానికి చేసిన సేవలకు బిషప్ జయరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకకు దేశవ్యాప్తంగా ఉన్న అనేక మంది సీనియర్ చర్చి నాయకులు హాజరయ్యారు, వీరిలో ఆర్చ్‌బిషప్ ఎమెరిటస్ ప్రకాష్ మల్లవరపు, రాయ్‌పూర్ ఆర్చ్‌బిషప్ విక్టర్ హెన్రీ ఠాకూర్, సీసీబీఐ వైస్ ప్రెసిడెంట్, బెంగళూరు ఆర్చ్‌బిషప్ పీటర్ మచాడో, ఆగ్రా ఆర్చ్‌బిషప్ రాఫీ మంజలీ, ఇతర ఆర్చ్‌బిషప్‌లు, బిషప్‌లు పాల్గొన్నారు.

మెట్రోకు 98 ఎకరాలు సేకరణ

- ఇందుకోసం రూ.670 కోట్లు ఖర్చు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



మహారాణిపేట: విశాఖ మెట్రో ప్రాజెక్టుకు 98 ఎకరాల భూములు అవసరం ఉందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ 98 ఎకరాల భూముల్లో 46 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, 52 ఎకరాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రూ.670 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం సుమారు వెయ్యి ఎకరాల వరకు భూసేకరణ చేపడుతున్నామని, ఆనందపురం మండలం పరిధిలో తర్లువాడ, కనమం, బీడిపాలెం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో భూములు ఉన్నట్లు వెల్లడించారు. వీటిలో కొన్ని ప్రభుత్వ భూములు ఉండగా.. మరి కొన్ని అసైన్డ్ భూములు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. విశాఖలో ఐటీ సంస్థలు నెలకొల్పడానికి పలువురు ముందుకు వస్తున్నారని, ప్రభుత్వ అనుమతితో వాటి కార్యకలాపాలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఐటీ సంస్థలు ఏర్పాటు చేసేవారికి రాయితీలు ఇస్తామన్నారు. బీచ్‌రోడ్డులో పర్యాటకులను ఆకర్షించే విధంగా బస్సులను ప్రవేశపెట్టే ఆలోచన ఉందన్నారు. విశాఖలో కీలకమైన మత్స్య రంగం ద్వారా రాబడులు పెంచడానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా స్థూల ఆదాయాన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.1.50 లక్షల కోట్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు, ఇతర సేవా రంగాల ద్వారా 15 శాతం వృద్ధిని నమోదు చేస్తే.. జిల్లా స్థూల ఆదాయం పెంపు సాధ్యమన్నారు. జిల్లాలో 200 హెక్టార్లలో బీడు భూములను వ్యవసాయ భూములుగా మార్పు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొబ్బరి, మామిడి తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తామని కలెక్టర్ వివరించారు.

సమీకృత సముదాయానికి మోక్షమెప్పుడు?

- ప్రారంభానికి నోచుకోని జిల్లా ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్
- రూ.25.20 కోట్లతో పూర్తి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- 10 నెలలు కిందట అందుబాటులోకి ఐదంతస్తుల భవనం
- కనీసం ట్రాన్స్‌ఫార్మర్ పెట్టలేకపోయిన కూటమి ప్రభుత్వం
- ఈపీడీసీఎల్‌కు రూ.24లక్షల చెల్లించేందుకు ఆలోచిస్తున్న వైనం



డీఐఎఫ్‌సీ భవనం

సాక్షి, విశాఖపట్నం: పాతిక కోట్ల రూపాయలు ఖర్చు చేసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదంతస్తుల భవనాన్ని నిర్మించింది. కానీ పాతిక లక్షల రూపాయల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా ఐదు ప్రభుత్వ సంస్థల కార్యకలాపాలతో కళకళలాడాల్సిన జిల్లా ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్(డీఐఎఫ్‌సీ) భవనం.. దాదాపు పది నెలలుగా కళావిహీనంగా కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా.. ఇంకా శిథిల భవనంలోనే జిల్లా ఖజానా కార్యాలయ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఆర్థిక శాఖకు చెందిన కార్యాలయాల నిర్వహణ కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెడ్‌క్రాస్ భవనం ఎదురుగా జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయం ఆవరణలో డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ కాంప్లెక్స్ (డీఐఎఫ్‌సీ)ని నిర్మించారు. గతంలో ఇక్కడ పే అండ్ అకౌంట్స్ కార్యాలయ భవనం ఉండేది. ఇది శిథిలావస్థకు చేరడంతో ఆ భవనాన్ని కూల్చేశారు. 2019లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.25.20 కోట్లతో ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో అంతస్తు 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో సిద్ధం చేసింది. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న పే అండ్ అకౌంట్స్, ఏపీజీఎస్ఐ, స్టేట్ ఆడిట్ కార్యాలయాలను ఇక్కడకు తరలించాలని భావించింది. ఈ నేపథ్యంలోనే పనులను చురుగ్గా నిర్వహించి.. 95 శాతం వరకు పూర్తి చేసింది.

గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అధికారులు.. అప్పట్లో హెచ్‌టీ కనెక్షన్ కావాలని కోరారు. ఐదు అంతస్తులు ఉండటం వల్ల హెచ్‌టీ కనెక్షన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉంటుందని ఈపీడీసీఎల్ అధికారులు స్పష్టం చేశారు. ఈ సమయంలోనే ఎన్నికలు జరగడం, ప్రభుత్వం మారిపోవడంతో అంతా తల్లకిందులైంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు ఈపీడీసీఎల్‌కు రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ చలానా డబ్బులు చెల్లిస్తే పనులు దాదాపు పూర్తయిపోతాయని అధికారులు పలుమార్లు కూటమి ప్రభుత్వానికి విన్నవించారు. కానీ.. ప్రభుత్వం మాత్రం ఈ విలువైన భవనాన్ని పట్టించుకోవడం మానేసింది. దీంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన రూ.3.50 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులను కూడా కాంట్రాక్టర్‌కు చెల్లించలేదు. దీంతో తుది దశ ఫినిషింగ్ పనులు ఆగిపోయాయి. బిల్లుల కోసం అధికారులు ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేకుండా పోయింది. కేవలం రూ.24 లక్షలు చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొస్తే.. మూడు అంతస్తుల్లో తక్షణమే కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలవుతుంది. కానీ ప్రభుత్వం రాజకీయ కోణంలో నిస్సిగ్గుగా ఆలోచిస్తూ.. విలువైన భవనాన్ని గాలికొదిలేసింది. ఈ భవనం అందుబాటులోకి వస్తే.. శిథిలావస్థలో ఉన్న ట్రెజరీ కార్యాలయంతో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడ కొనసాగించే అవకాశం ఉంది.

కమలం.. కనువిందు



విశాఖ నగర రోడ్లపై ఓ అందమైన కమలం విరబూసింది. అయితే ఇది నిజమైనది కాదు.. ఓ కళాకారుడి సృజనాత్మకతతో రూపుదిద్దుకున్న కళాఖండం. ఫంక్షన్లలో అలంకరణ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఈ కృత్రిమ కమలాన్ని కళాకారులు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా.. ప్రజలంతా ఆసక్తిగా చూశారు. కళాకారుడి ప్రతిభకు ఇది నిదర్శనంగా నిలిచింది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కన్నెర్రజేస్తే ఫ్యూజులు కట్ అవుతాయి

- విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జేఏసీ
- 26 జిల్లాల్లో జేఏసీ కొత్త కమిటీల ఏర్పాటు
- విశాఖలో జరిగిన సమావేశంలో జేఏసీ చైర్మన్‌గా ఎం.రమేష్ ఎన్నిక



సంఘీభావం తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : డిస్కమ్‌ల్లో ఉద్యోగులు, కార్మికులు ఓపిగ్గా ఉన్నారనీ.. ఒక్కసారి కన్నెర్రజేస్తే మీ ఫ్యూజులు కట్ అయిపోతాయని విద్యుత్ ఉద్యోగుల(ఈపీడీసీఎల్) జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ ఎంపీ రాఘవరెడ్డి హెచ్చరించారు. విశాఖపట్నంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీడీసీఎల్‌లో ఉద్యోగుల వ్యతిరేక చర్యలను ఖండిస్తున్నామన్నారు. యాజమాన్యం కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే ఉద్యమ బాట పట్టడం తప్ప మరో మార్గం లేదన్నారు. వివిధ సంఘాల చైర్మన్లు, కన్వీనర్లు మాట్లాడుతూ అన్ని డిపార్ట్‌మెంట్లలో రిక్రూట్‌మెంట్లు జరుగుతున్నాయనీ.. కానీ డిస్కమ్‌ల్లో ఎలాంటి రిక్రూట్‌మెంట్లు నిర్వహించకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో అదనంగా ఇంక్రిమెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వెన్ను చూపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత పనిచేసినా విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని వాపోయారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లతో పాటు 26 జిల్లాల్లో జేఏసీ కొత్త కమిటీలు వేసి ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కమిటీలు పూర్తయిన అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం డిస్కమ్‌లోని అన్ని యూనియన్లు, అసోసియేషన్‌ల నుంచి జేఏసీని ఎంపిక చేశారు. చైర్మన్‌గా ఎం.రమేష్, కన్వీనర్‌గా భూక్యా నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా జోగి నాయుడు, వైస్ చైర్మన్‌గా తురగా రామకృష్ణ, ఇతర బీసీ, బహుజన, ఎస్సీ, ఎస్టీ నాయకుల్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపాలరావు, పోలాకి శ్రీనివాసరావు, వి.గణపతి, బి.సాయికృష్ణ, అన్నే శ్రీనివాసకుమార్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం

- బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: స్వయం ఉపాధి పొందాలనుకునే అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కోరారు. సులభతర విధానాలు పాటిస్తూ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్యాంకు ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమై.. వివిధ అంశాలపై సమీక్షించారు. వివిధ సామాజిక వర్గాల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి తగిన విధంగా అండగా నిలవాలన్నారు. సమావేశంలో ఎల్డీఎం శ్రీనివాస్, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల కళ్లు గప్పి.. 'వ్యభిచారం' నిందితుడి పరారీ

తగరపువలస: వ్యభిచారం కేసులో పోలీసులు అదుపులో తీసుకున్న ఓ నిందితుడు పరారయ్యాడు. చిట్టివలస సుఖీభవకాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్న నలుగురు మహిళలు, ఒక పురుషుడిని బుధవారం టాస్క్‌ఫోర్స్, భీమిలి పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అయితే భీమిలి పోలీసులు అదుపులో తీసుకున్న ఐదుగురు నిందితుల్లో ఒకరు గురువారం ఉదయం పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. పరారైన వ్యక్తి విజయనగరానికి చెందిన ఎల్లయ్యగా గుర్తించారు.

నేడు జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ రాక

మహారాణిపేట: జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్ ఎస్.విజయ భారతి శుక్రవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 8.25 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. బ్రాండెక్స్ వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 5వ తేదీన ఉదయం 9 గంటలకు విమానంలో హైదరాబాద్ బయలుదేరుతారు.

కంది.. అందకుంది!

- కంది పప్పు కోసం కార్డుదారుల నిరీక్షణ
- పెరిగిన ధరలతో సామాన్యులు విలవిల
- గోదాముల్లో నిండుకున్న కందిపప్పు నిల్వలు
- రెండు నెలల ముచ్చటగానే పప్పు సరఫరా
- ఎన్నికల ముందు ఇచ్చిన కూటమి హామీలు గాలికే

జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు	5,12,619
చౌక ధరల డిపోలు	625
డోర్ టు డోర్ వాహనాలు	310
అవసరమైన కందిపప్పు	512 టన్నులు

మహారాణిపేట: పేద ప్రజలకు ఇస్తున్న అరకొర సరకుల్లో కూటమి సర్కార్ కోత కొనసాగుతోంది. రేషన్ షాపుల ద్వారా కందిపప్పు సరఫరా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా రేషన్ దుకాణాల ద్వారా ఇప్పటికీ పూర్తి స్థాయిలో నిత్యావసరాలు అందించని పరిస్థితి. ఎన్నికలకు ముందు రేషన్ డిపోల ద్వారా అనేక రకాల నిత్యావసరాలు అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీలు గుప్పించారు. ప్రతి నెల కందిపప్పు, రాగిపండి, వంట నూనె, ఇలా అనేక రకాల సరకులు ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి సరిపెట్టేస్తున్నారు. ఈ నెల(ఏప్రిల్) కూడా కందిపప్పు పంచే అవకాశం లేదు. కందిపప్పు ఇండెంట్ కూడ పెట్టలేదు. దీంతో కందిపప్పు గోదాములు దాటలేదు.

గతంలో తంచనుగా సరఫరా

ప్రస్తుతం అర్బన్ డీఎస్‌వో పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో 5 లక్షల 12 వేల 619 తెలుపు కార్డులతోపాటు 625 చౌకధరల డిపోలు ఉన్నాయి. ఒక జిల్లా సప్లయ్ అధికారి(డీఎస్‌వో) ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ సప్లయ్ ఆఫీసర్ల(ఏఎస్‌వో)తో కలిపి 21 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు ఈ విభాగంలో పనిచేస్తున్నారు. జిల్లాలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం 310 వాహనాలను ఉపయోగిస్తున్నారు. రెండు, మూడు రేషన్ డిపోలకు కలిపి వాహనాల ద్వారా సరకులు అందిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కందిపప్పు సరఫరా తంచనుగా జరిగేది. కార్డుదారుడుకి కిలో కందిపప్పు చొప్పున ఇచ్చేవారు. డీలర్లకు రూ.69కు కందిపప్పు ఇస్తే దాన్ని, కార్డుదారులకు రూ.70కు పంపిణీ చేయాల్సి ఉంది. ఇదే పద్ధతిలో గత ప్రభుత్వ హయాంలో కందిపప్పు పంపిణీ జరిగేది.



కందిపప్పు ప్యాకెట్(ఫైల్)

అక్టోబర్‌లో అరకొర.. జనవరిలో పూర్తిగా..

ప్రస్తుతం నాణ్యమైన కందిపప్పు రూ.140 నుంచి రూ.180 పలుకుతోంది. ఇంత ఖరీదుతో కందిపప్పు కొనుగోలు చేసి, తినే పరిస్థితిలో సామాన్య ప్రజలు లేరు. దీంతో రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం ఇచ్చే కందిపప్పు మీదే చాలా మంది ఆధారపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది అక్టోబర్, ఈ ఏడాది జనవరి నెలల్లో మాత్రమే కందిపప్పు ఇచ్చారు. మొత్తం విశాఖలో ఉన్న 5.12 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు నెలకు 512 టన్నుల కందిపప్పు అవసరం. అయితే అక్టోబర్లో కేవలం 30 టన్నుల కందిపప్పు మాత్రమే విడుదల చేశారు. రేషన్ డిపోకు 100–200 కిలోల చొప్పున కేటాయించారు. జనవరి నెల్లో మాత్రం పూర్తి కోటా ఇచ్చారు. ఆ రెండు నెలల్లో మినహా మరెప్పుడూ కందిపప్పు సరఫరా చేసిన దాఖలాల్లేవు. ఈ నెల కూడా సరకుల ఇండెంట్‌లో కందిపప్పు జాడ కానరాలేదు.

రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్‌లో

సౌకర్యాలు మృగ్యం

- ఎండలోనే ప్రయాణికుల పడిగాపులు
- పనిచేయని డిస్‌ప్లే బోర్డులు



రిజర్వేషన్ కాంప్లెక్స్ వద్ద తత్కాల్ ప్రయాణికుల కోసం ఆరు బయట వేసిన బెంచీలు



పూర్తిగా పని చేయని డిస్‌ప్లే బోర్డు



ప్రకటనలకే పరిమితమైన డిస్‌ప్లే బోర్డు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే రిజర్వేషన్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కరువయ్యాయి. రిజర్వేషన్ ప్రయాణికులు, ముఖ్యంగా తత్కాల్ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తత్కాల్ టికెట్లను ఒక రోజు ముందు బుక్ చేసుకోవాలి. ఈ టికెట్లకు డిమాండ్ ఉండటంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు రిజర్వేషన్ కాంప్లెక్స్ వద్ద పడిగాపులు కాస్తుంటారు. అయితే వీరి కోసం కాంప్లెక్స్ బయట కొన్ని బెంచీలు ఏర్పాటు చేసినప్పటికీ, అవి ఆరుబయట ఉండటంతో ఎండ, వాన నుంచి రక్షణ లేకుండా పోతోంది. ఈ కారణంగా సీనియర్ సిటిజన్స్ తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీసం నీడ కూడా లేకపోవడంతో వీరు ఎండలోనే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. తత్కాల్ టికెట్లను రిజర్వేషన్ టికెట్ ధరల కంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తారు. అయితే అధిక ధర చెల్లించే ప్రయాణికుల కోసం రైల్వే అధికారులు సరైన వసతులు కల్పించకపోవడం బాధాకరం. ఇదిలా ఉండగా.. రిజర్వేషన్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సమాచారం అందించే డిస్‌ప్లే సిస్టమ్స్ కూడా పనిచేయడం లేదు. మొత్తం 12 కౌంటర్లు ఉన్నప్పటికీ.. రోజుకు కేవలం 5–6 కౌంటర్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. పని చేసే కౌంటర్ల వద్ద ఉన్న డిస్‌ప్లే సిస్టమ్స్‌లో టికెట్ వివరాలు కనిపించకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. సుమారు ఆరు నెలలుగా ఈ డిస్‌ప్లే సిస్టమ్స్ పనిచేయడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. కేవలం ప్రకటనల కోసం మాత్రమే కొన్ని సిస్టమ్స్‌ను వినియోగిస్తుండటం గమనార్హం. సంబంధిత అధికారులు ఇక్కడ సౌకర్యాలపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర సర్వీసులకు కొత్త బస్సులు

- ఆర్ఎం అప్పలనాయుడు



విశాఖ డిపోను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం: బస్ డిపోలతో పాటు బస్సులను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని ఏపీఎస్‌ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన విశాఖపట్నం డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. విశాఖపట్నం డిపోలో పరిశుభ్రత మరింత మెరుగుపడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గురువారం నుంచి భద్రాచలం–విజయవాడ బస్సుల ద్వారా మరింత ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నం డిపో నుంచి దూర ప్రాంతాలకు, అంతర్రాష్ట్ర సర్వీసులకు కొత్త బస్సులు కేటాయించినట్లు చెప్పారు. డ్రైవర్లు, కండక్టర్లు పోటీ తత్వంతో పనిచేసి విశాఖపట్నం డిపోకు మరింత ఆదాయం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బస్సుల మరమ్మతులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎస్ 6 బస్సులకు సంబంధించి సిబ్బందికి కొత్త టెక్నాలజీతో కూడిన టూల్స్ సరఫరా చేస్తామన్నారు. వేసవి కాలంలో సిబ్బంది ఎవరూ వడదెబ్బకు గురికాకుండా ఎప్పటికప్పుడు మజ్జిగ, మంచినీళ్లు తీసుకోవాలన్నారు. బస్ స్టేషన్, డిపోల్లో తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.రాజశేఖర్, డిపో మేనేజర్ కె.గంగాధర్, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, ఎస్.ఎస్. అప్పారావు, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమోన్మాది నవీన్‌కు 14 రోజుల రిమాండ్



నవీన్

మధురవాడ: ప్రేమోన్మాది దమరసింగి నవీన్‌కు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు పీఎంపాలెం ఎస్ఐ కె.భాస్కరరావు తెలిపారు. పెళ్లికి అంగీకరించడం లేదనే కోపంతో నవీన్ బుధవారం విచక్షణ రహితంగా తల్లీ కూతుళ్లపై దాడి చేసిన సంగతి తెలిసిందే. కొమ్మాదిలోని స్వయంకృషి నగర్‌లో జరిగిన ఈ ఘటన విశాఖనే కాదు యావత్ రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటనలో తల్లి నక్కా లక్ష్మి(47) మృతి చెందగా, కుమార్తె దీపిక ప్రస్తుతం మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటన అనంతరం నిందితుడు పరారయ్యేందుకు ప్రయత్నం చేయగా.. పోలీసులు శ్రీకాకుళం జిల్లాలో అతన్ని పట్టుకుని బుధవారం సాయంత్రం పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. గురువారం సాయంత్రం నిందితుడిని భీమిలిలో న్యాయమూర్తి ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు. నవీన్ డిగ్రీ పూర్తి చేసినా సక్రమంగా స్థిరపడకపోవడంతో ఎనిమిదేళ్లుగా దీపిక తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోకుండా తరచూ వాయిదాలు వేస్తున్నారు. బుధవారం కూడా అదే జరిగింది. దీంతో నిందితుడు వారిపై దాడికి దిగాడు.

దీపికకు పరామర్శ

ఎంవీపీకాలనీ: ప్రేమోన్మాది దాడి ఘటనలో గాయపడిన దీపికను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, మహిళా కమిషన్ సభ్యులు గురువారం పరామర్శించారు. ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను కమిటీ సభ్యులు గొండు సీతారాం, జయశ్రీ, జిల్లా శిశు సంక్షేమం, సాధికారత అధికారి జయదేవి తదితరులు పరామర్శించి.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దీపిక యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

లారీ ఢీకొని తాపీమేస్త్రీ దుర్మరణం



లారీ చక్రాల నలిగిపోయిన ప్రభాకరరావు (ఇన్‌సెట్) ప్రభాకరరావు(ఫైల్)

పీఎంపాలెం: జాతీయ రహదారిపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ కేసుకు సంబంధించి పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 5వ వార్డు పరిధి సాయిరామ్ కాలనీ ఫేజ్–1లో బలగా ప్రభాకరరావు(49) భార్య మణి, కుమార్తె చాందినితో కలిసి నివాసం ఉంటున్నాడు. తాపీ మేస్త్రీగా స్థానికంగా మంచి పేరు ఉంది. ఆనందపురం మండలం తాళ్లవలసలోని గరుడాద్రి లే అవుట్‌లో భవన నిర్మాణ పనులు చేయడానికి గురువారం ఉదయం 8.40 గంటలకు అదే ప్రాంతానికి చెందిన ఎల్.కామేశ్వరరావుకు చెందిన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కామేశ్వరరావు వాహనం నడుపుతుండగా ప్రభాకరరావు వెనుక కూర్చున్నాడు. జాతీయ రహదారిపై వెళుతుండగా బోరవానిపాలెం కూడలికి సమీపంలోని రామకృష్ణ గ్రానైట్స్ ఎదురుగా వచ్చేసరికి అదే రోడ్డులో వెనుకనే వస్తున్న లారీ.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రభాకరరావు లారీ చక్రాల కింద పడి నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మరణించాడు. కామేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రభాకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య మణి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ శ్యామలరావు కేసు నమోదు చేశారు.

బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు

విశాఖ లీగల్ : వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపి మహిళ మృతికి కారణమైన బస్సు డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ప్రదీప్ కుమార్ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అదనపు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు మిట్టాన గురువులు చైతన్య విద్యాసంస్థలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2023 ఏప్రిల్ 12వ తేదీన చైతన్య పాఠశాల నుంచి విద్యార్థులను సింహాచలం వైపు తీసుకెళ్తున్న క్రమంలో ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని దీనదయాల్‌పురం వద్ద ఎదురుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. బైక్‌పై వెళ్తున్న నక్కన స్వామికి తీవ్రగాయాలయ్యాయి. వెనుక కూర్చున్న అతని తల్లి లక్ష్మి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆరిలోవ ఎస్ఐ సిహెచ్.సూర్యనారాయణ నిందితులపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304 ఏ కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు. బాధితులు నష్టపరిహారం కోసం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవా ప్రాధికార సంస్థను సంప్రదించాలని పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు గాయాలు
- నిద్రమత్తు కారణంగానే ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ సిగ్నల్ పాయింట్‌కు సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. కారు నడుపుతున్న వ్యక్తి నిద్రమత్తులో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. వివరాలివి.. పాతగాజువాక అశోక్‌నగర్‌కు చెందిన లావేటి క్రాంతి కుమార్ ఎండాడలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీని నిర్వహిస్తున్నారు. అతని తండ్రి కృష్ణారావు.. కుమారుడిని తీసుకొచ్చేందుకు బుధవారం అర్ధరాత్రి కారులో ఎండాడ వెళ్లారు. తన కుమారుడితో పాటు అదే కంపెనీలో పనిచేస్తున్న శ్రీహరిపురం ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన కె.వాసవిని ఆమె నివాసం వద్ద దింపేందుకు కారులో ఎక్కించుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల ప్రాంతంలో షీలానగర్ సిగ్నల్ పాయింట్ సమీపంలో కారు నడుపుతున్న కృష్ణారావు నిద్రమత్తులోకి జారుకున్నారు. దీంతో అదుపుతప్పిన కారు వేగంగా రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఆ సమయంలో తన తండ్రిని కాపాడే ప్రయత్నంలో స్టీరింగ్‌పై తలపెట్టడంతో క్రాంతి కుమార్‌కు ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న వాసవి కూడా గాయాలపాలైంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కృష్ణారావు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను షీలానగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని సీఐ కోటేశ్వరరావు తెలిపారు.

ఎంఐజీ ప్లాట్లకు లాటరీ

- 113 దరఖాస్తుదారులకు ప్లాట్ల నెంబర్లు కేటాయింపు

విశాఖ సిటీ : ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజీ లేఅవుట్లలో ప్లాట్ల కోసం వచ్చిన దరఖాస్తులకు గురువారం లాటరీ నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన ఈ కార్యక్రమంలో 113 దరఖాస్తుదారులకు ప్లాట్ల నెంబర్లను కేటాయించారు. మధ్య తరగతి ప్రజల కోసం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజీ లేఅవుట్లను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసింది. అనకాపల్లి జిల్లాలోని అడ్డూరు గ్రామంలో 19.99 ఎకరాల విస్తీర్ణంలో 146 ప్లాట్లు, విజయనగరం జిల్లా గరివిడి గ్రామంలో 21.30 ఎకరాల విస్తీర్ణంలో 212 ప్లాట్లు, విశాఖ జిల్లా పాలవలస గ్రామంలో 76.96 ఎకరాల విస్తీర్ణంలో 472 ప్లాట్లను అన్ని మౌలిక సదుపాయాలతో తీర్చిదిదుతున్నారు. ప్రతి లేఅవుట్ మొత్తం ప్లాట్లలో 10 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు, 5 శాతం ప్లాట్లను ప్రభుత్వ పెన్షనర్లకు కేటాయించాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు కేటాయించిన 10 శాతం ప్లాట్లకు 20 శాతం రాయితీ కూడా అందిస్తున్నారు. లాటరీ ద్వారా మొదటిసారిగా అడ్డూరులో 25 మందికి, గరివిడిలో ముగ్గురికి, పాలవలలో మూడు విడతలు నిర్వహించిన లాటరీలలో 226 ప్లాట్లను కేటాయించారు. మిగిలిన ప్లాట్లకు కూడా ఆసక్తి ఉన్న వారు టీటీ.రుజీజ్బు ఐట్టీధి ఇజౌరి.జీ౩ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా, ప్లానింగ్ అధికారిణి చామంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లైసెన్స్ రద్దయిన వారు వాహనం నడిపితే చర్యలు



ట్రాఫిక్ పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారిపై కేసు నమోదైతే 3 నెలలు వారి లైసెన్స్ రద్దవుతుందని, అలా రద్దయిన వ్యక్తులు వాహనం నడపరాదని ఇన్‌చార్జి డీటీవో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. నగరంలో పలు చోట్ల గురువారం నిర్వహించిన తనిఖీల్లో లైసెన్స్ రద్దయి వాహనాలు నడుపుతూ 20 మంది పట్టుబడ్డారన్నారు. మోటార్ వెహికల్ చట్టం యు/ఎస్ 207 ప్రకారం జప్తు చేసి, వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇద్దరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. లేకుంటే కేసుతో పాటు, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

శవాన్ని పీక్కుతిన్న పందులు

- శ్మశానవాటికలో దారుణ పరిస్థితులు



శ్మశానంలో మృతదేహాన్ని తింటున్న పందులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కోరమాండల్ పరిశ్రమకు సమీపంలోని శ్మశానవాటికలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ పూడ్చిన మృతదేహాలను పందులు, కుక్కలు వెలికి తీసి పీక్కుతింటున్న ఘటన గురువారం వెలుగులోకి రావడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో ఈ శ్మశానవాటికలో పందుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. మృతదేహాలను దహనం చేయడానికి లేదా పూడ్చడానికి వచ్చినప్పుడు బంధువులు వెంట తెచ్చే అరటి పళ్లు, కొబ్బరికాయలు వంటి ఆహార పదార్థాలను కర్మకాండ అనంతరం ఇక్కడే వదిలివేస్తున్నారు. శ్మశానవాటిక సిబ్బంది వ్యర్థాలను తొలగించకపోవడం వల్ల.. వాటి కోసం పందులు, వీధి కుక్కలు శ్మశానవాటికకు వస్తున్నాయి. ఆహారం కోసం అలవాటుపడిన పందులు, చివరికి పూడ్చిపెట్టిన శవాలను సైతం బయటకు లాగి తింటున్నాయి. ఈ పరిస్థితిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీరంలో కూర్మం



విశాఖ తీరంలో పగటిపూట సముద్ర తాబేలు కనిపించింది. ఇవి సాధారణ తాబేళ్ల కంటే భిన్నంగా భారీ శరీరాన్ని కలిగి ఉంటాయి. తెల్లవారుజామున రెండు నుంచి మూడు గంటల మధ్య తీరానికి వచ్చి గుడ్లు పెట్టి.. తర్వాత సముద్రంలోకి వెళ్లిపోతాయి. ఇలా ఒక్కో తాబేలు 60 నుంచి 120 వరకు గుడ్లు పెడతాయి. అయితే గురువారం పగటిపూట ఓ సముద్ర తాబేలు కనిపించి.. 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

బుట్ట బొమ్మ పువ్వు..



పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్కులో అందమైన బుట్టబొమ్మ పువ్వులు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ పువ్వులు మాల్వేసి కుటుంబానికి చెందినవి. వీటి శాస్త్రీయ నామం స్త్రీయాటం. వీటిని చైనీస్ లాంతరు, రెడ్ వీన్ ఇండియన్ మాలో అని కూడా పిలుస్తారు. దక్షిణ బ్రెజిల్, అర్జెంటీనా, పరాగ్వే, ఉరుగ్వే తదితర ప్రాంతాల్లో వికసించే ఈ రంగురంగుల పువ్వులు.. బయో డైవర్సిటీ పార్కులోనూ పూసి చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

– బీచ్‌రోడ్డు

100 కిలోల గంజాయి స్వాధీనం

కూర్మన్నపాలెం: గంజాయి తరలిస్తున్న ముఠాలోని ఒకరిని దువ్వాడ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన నలుగురు ప్రైవేటు వాహనంలో గంజాయి తరలిస్తుండగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద పట్టుకున్నారు. ఐదుగురిలో నలుగురు పరారు కాగా.. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 44 బస్తాల్లో 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)	
విశాఖ	440.00
విజయనగరం	444.00
శ్రీకాకుళం	444.00

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	రూ.115
బ్రాయిలర్ (లైవ్)	రూ.135
స్కిన్	రూ.240
స్కిన్‌లెస్	రూ.250

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.93,380
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.85,600
వెండి(కిలో):	రూ.1,12,000